ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : **బి.వి.ఎల్.ఎన్.రాజు**

**సంపుటి : 22** **సంచిక : 3** **నవంబర్ 2016**

**రమణ భాస్కర**

**ఆధ్యాత్మిక మాస పత్రిక**

**పేజీలు : 16**

**గౌరవ సంపాదకులు**

శ్రీమతి **P.H.V.**
**సత్యవతి (హైమ)**

**చందా**

సంవత్సర చందా:రు॥ **150/-**

విడి ప్రతి : రు॥ **12/-**

**చిరునామా**

**రమణ భాస్కర**

**శ్రీ రమణ క్షేత్రం,**
**జిన్నూరు – 534 265**
**ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥**

**పబ్లిషర్**

**సద్గురు శ్రీ నాన్నగారు**
**శ్రీ రమణ క్షేత్రం**
**జిన్నూరు – 534 265**
☎ **08814 - 224747**
**9247104551**

**ఈ సంచికలో....**

**జూన్ 2016**
**అరుణాచలం**

**25-08-2016**
**జిన్నూరు**

**ప్రింటర్**
**శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్**
**(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,**
**పాలకొల్లు,** **9848716747**

**(సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, జూన్ 2016, అరుణాచలం)**

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మానవుడు తన వ్యక్తిగత స్వార్థాన్ని నెమ్మదిగా వదులుకోవలసి ఉంటుంది. జ్ఞానం పొందటానికి నీ స్వార్థమే నీకు అడ్డు వస్తోంది. అందుచేత స్వార్థాన్ని నెమ్మదిగా తగ్గించుకోవాలి. నేను, నాది ఈ రెండు కనుక మనకు ఉంటే మనలను జైలులో పడేస్తారు. ఆ జైలే సంసారం. ఎవరికో ఒక అరటిపండు ఇవ్వటం త్యాగం కాదు. నిజమైన త్యాగం ఏమిటి అంటే నీ దేహబుద్ధిని, దేహమే ఆత్మ అనుకొనే బుద్ధిని విడిచిపెట్టటమే నిజమైన త్యాగం. కర్మకు జ్ఞానానికి ఏమి విరోధం లేదు. నువ్వు చేసే కర్మ ద్వారా కూడా జ్ఞానాన్ని పొందవచ్చు. మీరు చేసే కర్మ ఎలా చేయాలో తెలుసుకొని చేసే పని ద్వారా కూడా మీకు జ్ఞానం వస్తుంది. మీరు చేసే పని నార్మల్‌గా చేయండి, నేచురల్‌గా చేయండి, నేను చేస్తున్నాను అనే భావన లేకుండా చేయండి. అలా పని చేయటం వలన మీకు చిత్తశుద్ధి కలుగుతుంది. చిత్తశుద్ధి అనే గేటు ద్వారా మీకు జ్ఞానం కలుగుతుంది. భగవంతుడు ఒకో శరీరానికి ఒకో పని ఇస్తాడు. ఆ పని మనకు ఇష్టం లేకపోయినా భగవంతుడు మనకు కేటాయించాడు కాబట్టి ఆ పని చేయాలి. అన్ని శరీరాలు ఒకే పని చేస్తే ప్రపంచయాత్ర ఎలా సాగుతుంది? ఒకో శరీరం ద్వారా ఒకో పని జరుగుతుంది. అందుచేత భగవంతుడు మీకు ఏ పని అయితే ఇచ్చాడో దానిని నార్మల్‌గా, నేచురల్‌గా చెయ్యాలి. అలా మీ పనిని మీరు చేసుకోవటం ద్వారా కూడా మీకు జ్ఞానం వస్తుంది.

మనం నేను, నేను అంటున్నాము కదా! అది దేహగతమైన నేను, అది బుల్లి నేను. ఈ బుల్లి నేనును, చిన్న నేనును నువ్వు వదులుకుంటే అంతటా వ్యాపించిన నేను నీకు అనుభవంలోనికి వస్తుంది. ఈ బుల్లి నేనును తగ్గించుకుంటే నీ ఆలోచనలో మార్పు వస్తుంది, నీకు వచ్చే తలంపులలో మార్పు వస్తుంది, నీ పూర్వపు జీవితం

మారిపోయి నీకు కొత్త జీవితం వస్తుంది. అంటే ఈ శరీరంలోనే చచ్చిపోయి మరల ఈ శరీరంలోనే పుడతావు. అంటే శరీరం మారదు. శరీరం అదే కాని లోపల మారిపోతారు. నువ్వు పూర్వం ఎలా ఉన్నావో అలాగ ఉండవు. లోపల ఉన్న యూనివర్సల్ ఐ అనుభవంలోనికి వచ్చినప్పడు ఇంక ఈ బుల్లోడు కనబడడు. ఊరికే శరరీం ఇంటిదగ్గర తిరుగుతూ ఉంటుంది కాని లోపల మార్పు వచ్చేస్తుంది. ఇంట్లో వ్యక్తులతో కలిసి తిరుగుతూ ఉన్నా వారికి నీకు ఏమీ సంబంధం లేదని లోపల తెలుస్తూ ఉంటుంది. భగవాన్ కూరలు బాగా వండుతారు. కూరకు రూపం, నామం లేకుండా చేసేస్తారు. అది వంకాయ కూర అనుకోండి, ఆ కూరను చూసి అది వంకాయకూర అని మీరు చెప్పలేరు. నోట్లో పెట్టుకొనేవరకు అది ఫలానా కూర అని మీకు తెలియదు. అంటే నామరూపాలు లేకుండా తీసేస్తాడు. అలాగే మీరు రూపదృష్టిని, నామదృష్టిని తగ్గించుకుంటే బుల్లినేను పోతుంది. మీరు దానితో పేచీలు పెట్టుకొని, యుద్ధాలు చేయనక్కరలేదు. దానితో గొడవ ఎందుకు? మీరు దానిని పట్టించుకోకుండా ఉంటే అదే వెళ్ళిపోతుంది. మీ ఇంటికి చుట్టం వచ్చాడు అనుకోండి, వాడిని ఏదో గెంటేసినట్లు కనబడకండి. వాడిని పట్టించుకోకుండా మీరు నార్మల్‌గా ఉండండి, వాడే వెళ్ళిపోతాడు. అంటే మీలో ఏదో విశేషం ఉంది అనుకోవటం మానేయండి. ఎదుటివారికంటే మనలో ఏదో విశేషం ఉంది అనుకొంటేమటుకు ఈ బుల్లినేను మిమ్మల్ని వదలదు, ఈ బుజ్జిగాడు అలాగే ఉంటాడు. ఇతరులలో లేనిది మనలో ఏదో ఉంది అని కొంతమంది అనుకొంటారు. నీలో ఏదో విశేషం ఉంది అని అనుకోవద్దు. అంతా ఈశ్వరుడే. నీలో ఏదో విశేషం ఉంది అనుకొంటే అది అహంకార లక్షణం. ఒకవేళ మీకు డబ్బు ఉన్నా ఆ డబ్బు మీరుకాదు, ఒకవేళ మీకు చదువు ఉన్నా ఆ చదువు మీరు కాదు, మీకు ఏదైనా పదవి ఉండవచ్చు, ఆ పదవి మీరు కాదు. అది మీకు తెలియాలి. అంతేగాని మాలో ఏదో విశేషం ఉందని మీరు అనుకోవద్దు, అలా ఏదీ కల్పించుకోవద్దు. దానివల్ల అహంకారం పెరుగుతుంది. ఈ బుల్లినేను పోవాలంటే దానికోసం మీరు పెద్ద తపస్సులు చేయనక్కరలేదు, పెద్ద కష్టపడనక్కరలేదు. ఈ బుల్లి నేనును మీరు ముస్తాబు చేయవద్దు, మీరు నార్మల్‌గా ఉండండి. దానంతట అదే పోతుంది.

మనుషులు అందరూ ఏమి చేస్తున్నారు అంటే దుఃఖ స్పర్శలేని సుఖంకోసం వెదుక్కొంటున్నారు. మీకు సుఖం కావాలి. మీరు సుఖం కావాలి అని అనుకోవటంలో తప్పు లేదు. మీ స్వరూపంలో సుఖం ఉంది. మీకు దుఃఖం వస్తే ఇష్టం ఉండదు. ఎందుచేతనంటే మీ స్వరూపంలో దుఃఖం లేదు కాబట్టి మీకు దుఃఖం వస్తే ఇష్టం ఉండదు. మీ స్వరూపంలో సుఖం ఉంది కాబట్టి మీరు ఎప్పడూ సుఖంగా ఉండాలి అని కోరుకుంటున్నారు. మీ పేరే సుఖం. మీరు ఏదైతే అయి ఉన్నారో మీకు తెలియకుండా దానినే మీరు కోరుకొంటున్నారు. ఈ శరీరంతోటి, లోకంతోటి, విషయాలతోటి, వ్యక్తులతోటి సంబంధం లేకుండా స్వతంత్రమైన సుఖం మీకు కావాలి. మీకు బాగా ఆస్తులు ఉన్నాయి అనుకోండి, దానినిబట్టి మీకు కొంత సుఖం వస్తోంది అనుకోండి, అది స్వతంత్రమైనది కాదు. అది అంతా డిపెండెంట్. మీకు ఉన్న

ఆస్తులను బట్టి, చదువునుబట్టి, అధికారాన్ని బట్టి కొంతసుఖం, ఆనందం వస్తే రానివ్వండి, అది నిజంకాదు, అది ఎప్పడైనా పోయే ప్రమాదం ఉంది. ముగింపులేని సుఖాన్ని, ముగింపు లేని శాంతిని పట్టుకోవాలని మీరు చూస్తారు. మీ కోరిక సహజమే, అందులో తప్పలేదు. ఎందుచేతనంటే మీ స్వరూపమే అది కదా. మీ స్వరూపాన్ని మీరు కోరుకోవటంలో తప్పేముంది? అందులో తప్పేమీలేదే!

మిమ్మల్ని మీరు ప్రేమించుకొంటున్నారు. మిమ్మల్ని మీరు ప్రేమించుకోమని ఎవరైనా మీకు చెప్పారా? మీరంటే మీకు ఇష్టమేకదా! మీరంటే మీకు ఇష్టంగా ఉండండి అని ఎవరైనా మీకు చెప్పాలా? అది నేచురల్, నార్మల్ కదా! మీరంటే మీరు ఇష్టంగా ఉండండి అని చెప్పటం ఎందుకు? అలాగే ఉంటున్నారు కదా! మీరంటే మీకు ఎందుకు ఇష్టంగా ఉంటున్నారు? ముగింపులేని సుఖం, ఆనందం, శాంతి మీలోపలే ఉంది. అందుకే మీరంటే మీకు ఇష్టం. ఇవన్నీ నగ్నసత్యాలు. అయితే ఇవి మీకు జీర్ణం అవ్వకపోవచ్చు. అది వేరే విషయం. మీరు కొండ చుట్టూ తిరిగినా, మతాలు మార్చుకున్నా లేకపోతే ఒకేమతంలో ఉండి పనిచేసినా, మీరు భక్తి మార్గంలో ఉన్నా, జ్ఞానమార్గంలో ఉన్నా, ఏమార్గంలో ఉన్నా మీకు ఆనందం దొరకాలి. అయితే ఆనందం ఎక్కడ ఉంది? అది బయట ఎక్కడా లేదు. నీ హృదయంలోనే ఉంది. మీ హృదయంలో ఉన్నదే మీకు దొరకటం లేదు. అందుకే ఈ మతాలు, పూజలు, జపాలు, తపాలు, ఈ బాహ్యగొడవలు అన్నీ వచ్చాయి. నీకు ఆనందం దొరకాలి అంటే నీ స్వరూపంలో ఉన్న నిజం నీకు తెలియాలి. అది నీకు తెలిస్తే, అది నీకు అనుభవంలోనికి వస్తే అందులోనే ఆనందం ఉంది, సుఖం ఉంది, శాంతి ఉంది. ఎక్కడైతే ఆనందం ఉందో అది నీకు తెలియనప్పడు ఆనందం కూడా నీకు దొరకదు.

మీకు తత్వం తెలుసా అంటారు. తత్వమసి, తత్ అంటే అది త్వం అంటే నీవు అసి అంటే అయిఉన్నావు. అది నీవు అయివున్నావు. నీవు ఏదైతే వెదుకుచున్నావో, ఏ నిజంకోసం, ఏ ఆనందంకోసం అయితే వెదుకుచున్నావో అది నీవే అయి ఉన్నావు. అంటే నిన్ను నీవే వెతుక్కొంటున్నావు. నువ్వు గుడికి వెళ్ళినా, జపం చేసినా, ధ్యానం చేసినా నిన్ను నువ్వు పట్టుకోవడానికే ఇవి అన్నీ చేస్తున్నావు. నిన్ను నీవు తెలుసుకోవటానికే ఈ ప్రయత్నాలు అన్నీ చేస్తున్నావు అని నీకు తెలియటంలేదు. అందుచేత మానవుడు తన నిజ తత్త్వాన్ని తెలుసుకొంటే అనంతానందాన్ని పొందగలడు. ఇప్పడు నీకు నీ మనస్సు, శరీరం ఎరుకలో ఉంది కదా అలాగే నీ హృదయంలో ఉన్న తత్వం నీకు ఎరుకలోనికి వచ్చినప్పడు నీకు ఎటుచూసినా ఆనందమే, ఎటుచూసినా సుఖమే, ఎటుచూసినా శాంతే, గీతలో పరమాత్మ చాలాగొప్పగా చెప్పాడు. నీకు ఎక్కడ చెయ్యిపడితే అక్కడ మంచినీళ్ళు దొరకుతూ ఉంటే ఇంక నీకు నూతులతోటి, చెరువులతోటి పని ఏముంది? అలాగే నువ్వు ఎటుచూసినా ఆనందమే, ఎటుచూసినా సుఖమే అయినప్పడు ఇంక నీకు గుళ్ళు, గోపురాలతో పని ఏమిటి? వాడికి అంతటా మంచినీళ్ళు దొరికేటప్పడు చెరువుదగ్గరకు, నూతి దగ్గరకు వెళ్ళనక్కరలేదు. మనకు

ఉండుట తటస్థించినది. ఆ సత్సంగముల ద్వారా శ్రీనాన్నగారి సందేశమును మననము చేసికొనుటకు వారి గృహములో అవకాశము కల్పించుటయే కాక, ఇతర ప్రాంతములకు మమ్ము తీసుకెళ్ళి ఎంతగానో ప్రోత్సహించి, సహకరించినారు. కేవలము ఈ భౌతిక శరీరమే నాది దీని ద్వారా గురుదేవులు శ్రీనాన్నగారు ఆయన ప్రతినిధిగా అమెరికా సందర్శనమునకు, సత్సంగ నిర్వహణకు పంపినట్లు భావించితిని. ఏప్రిల్ 2016 నుండి ప్రారంభమైన సత్సంగములు మేము ఇక్కడ ఉన్నంత కాలం జరిగినవి. ఉగాది, భగవాన్ శరీరత్యాగ దినము, శ్రీరామనవమి, శ్రీశంకర జయంతి, గురుపూర్ణిమ, సందర్భముగా జరిగిన సత్సంగములకు ఎక్కువ మంది భక్తులు విచ్చేసినారు. మరియొక భక్తకుటుంబము ఆహ్వానము మేరకు ఆసక్తి పరులకు శ్రీనాన్నగారి బోధను వివరించి మననము చేసికొనుట జరిగింది. మానివాసమునకు వందమైళ్ళ దూరంలో ఉన్న రమణకేంద్రము అహం-సెంటరులో ప్రత్యేక అతిథిగా ఉన్న శ్రీగణేశనన్‌గారిని ఐదు పర్యాయములు దర్శించి వారి ఉపన్యాసములు వినుట జరిగినది. అక్కడ ప్రశాంత ఆధ్యాత్మిక వాతావరణము మమ్ములను ఎంతో ముగ్ధులను చేసినది. ప్రతి సత్సంగములోనూ శ్రీన్నాగారి బోధను మననము చేసుకొనుట జరిగినది. అనేకమంది తమ ఆధ్యాత్మిక సందేహములను వెలిబుచ్చి సమాధానములు తెలుసుకొనెడివారు. అమెరికా లోనిసత్సంగ సమావేశములలో మననము చేసుకొన్న అంశములు సద్గురువు శ్రీనాన్నగారి ఆదేశానుసారము ఇందు పొందు పరచుట జరిగినది. ఈ పర్యటనలో భాగముగా ఛార్లెట్‌లోని బాలాజీ మందిరము, సోమా పర్వతము మీద శ్రీసోమేశ్వరస్వామి ఆలయము, న్యూజెర్సిలోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయము, వర్జీనియాలోని హిందూ దేవాలయము, కేరీలోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయము, లాస్ ఏంజల్స్‌లోని శ్రీ పరమహంస యోగానంద గారి ఆశ్రమము, డెన్నిస్ రాష్ట్రం లోని శ్రీజగ్గీవాసుదేవ్ గారి ఆశ్రమము, అట్లాంటాలోని శ్రీస్వామి నారాయణ్ మందిరము దర్శించితిమి. ఆసక్తిపరులకు శ్రీనాన్నగారి బోధను అందిస్తూ, అసలు పరిచయంలేని వారికి పరిచయం చేయుట ద్వారా విత్తనము జల్లినట్లు అయినది. శ్రీరమణాశ్రమమునుగాని, శ్రీనాన్నగారిని కాని దర్శించనివారుంటే భారతదేశము వెళ్ళినప్పుడు తప్పక దర్శించమని కోరుట జరిగినది. సర్వవ్యాపి పరమాత్మ అందరి హృదయాల లోనూ స్వరూపంగా, అంతర్యామిగా ఉన్నాడు కాబట్టి ఆసక్తి గలవారికి అంతరదృష్టిని కలిగించి ఆ సత్యములోనికి మేల్కొలుపుటకు చేసే ఏ కొద్ది సహాయమైనా నిజమైన సేవ అవుతుంది. ఆసక్తి ఉన్నవారికి ఆధ్యాత్మిక అభివృద్ధి కలుగుటకు సహాయపడుట మీద మన ఆధ్యాత్మిక అభివృద్ధి ఆధారపడి ఉంటుంది, అన్న విశ్వాసమే ఈ సత్సంగములకు పునాది. మార్గము ఏదైనా మనము ఎంతవరకు శ్రద్ధతో, చిత్తశుద్ధితో ఆచరిస్తున్నాము అన్నది ప్రధానం.

నేటి మానవుని పరిస్థితి ఒడ్డున పడిన చేపవలె ఉన్నది, తిరిగి నీటిలో పడుటయే ఆ చేపకు తక్షణ అవసరం. అదేవిధంగా ఒడ్డున పడిన చేప వలె మానవుడు వాస్తవంగా తాను ఎవరో? మరచి తాను ఒక వ్యక్తి నని, దేహమాత్రుడనని భావించి, జనన - మరణ సంసార

చక్రంలో పడి, దుఃఖాన్ని, అశాంతిని, అనుభవైక వేద్యం అయితేగాని, అనగా సద్వస్తువు తానుగా అనుభవంలోకి వస్తేగాని, జనన మరణప్రవాహం ఆగదు. భౌతిక విద్యవల్ల ఆకలి, దప్పికను తీర్చుకోవచ్చు, కాని పరమశాంతికోసం, పునరావృత్తి రాహిత్యం కోసం ఆత్మవిద్యను ఆశ్రయించవలసియున్నది. మోక్షము లేదా స్వస్వరూపానుభూతియే జీవితానికి పరమావధి స్వరూప సచ్చిదానంద స్థితిని తానుగా నేనుగా అనుభవంలోకి తెచ్చుకొనుటయే మన కర్తవ్యము. మనను ఒక వ్యక్తిగాపరమాత్మకన్న వేరుగా భావించినంత కాలము జనన - మరణాలకు, దుఃఖానికి, అశాంతికి గురి అవుతూనే ఉంటాము. ఈ మానవ శరీరంలో ఉంటూ, ప్రపంచములోని హెచ్చుతగ్గులమధ్య మరియు మనసు కల్పించే ద్వంద్వాల మధ్య జీవిస్తూ, నిష్ప్రపంచ స్థితిని పొందడం సుసాధ్యమే అంటారు భగవాన్ శ్రీరమణులు. సత్యము ఒక్కటే! సత్యము రెండుగా ఉండదు. వ్యక్తి తాలూకు సత్యమే పరమాత్మ తాలూకు సత్యము. 'నేను - ఉన్నాను' అదే సత్యము! అదే బ్రహ్మము! అదే మోక్షము! మానవుడు. జ్ఞానజీవి కావున జ్ఞానమార్గం ద్వారా మోక్షానుభవం పొందవచ్చు. అభేద సంబంధమే దైవానికి వ్యక్తికి మధ్య ఉన్నది. ప్రతి ఒక్కరము సత్యముతో ఏకత్వ సంబంధాన్నే, కలిగి ఉన్నాము. వాస్తవంగా మనము అమృతస్వరూపులమే, సచ్చిదానందమే మన సహజస్థితి. తత్త్వజ్ఞానం కలిగి వాస్తవంగా తాను ఎవరో? అనుభవైక వేద్యం అయితే అదే ఆత్మ సాక్షాత్కారం. మరపే మాయ. వాస్తవంగా తాను ఎవరో? మరిచిపోవడమే మాయ. మనది ఒక ఆధ్యాత్మిక ప్రయాణం, సత్యాన్వేషకుల మైన మనము సత్యాన్ని తెలుసుకొనుటకు అంతరయాత్ర చేస్తున్నాం. బాహ్యప్రపంచమునుండి అనగా స్థూలబుద్ధినుండి, అంతరంగా స్వస్వరూపంగా ఉన్న మన స్వస్థానానికి ప్రయాణం, అదే ఈ మానవ జన్మయొక్క పరమగమ్యం. వాసనాక్షయమే మోక్షం. కేవలం ఉనికిగా ఉన్న అద్వయ, అఖండ చైతన్యాన్నే బ్రహ్మము, ఆత్మ, అమృతస్థితి, సచ్చిదానందం, నిజమైన - నేను, గురువు, అనుగ్రహం, మోక్షం, తత్వం, నిర్వాణస్థితి, మున్నగు పేర్లతో పిలుస్తాం. వాస్తవంగా లేనివి భ్రాంతి, అభ్యాస కారణంగా నిజం కనిపించే వాటిని మనస్సు, బుద్ధి, జీవుడు, అహంకారం, మిధ్యా నేను, మున్నగు పేర్లతో పిలుస్తాం. సత్యము అనగా కేవలం ఉనికి ఆది మధ్యాంతరహితము. సత్యము దేశ, కాల, నామ, రూపములకు, దేహేంద్రియమనో బుద్ధులకు, మూడు అవస్థలకు, మూడు శరీరాలకు, మూడు కాలములకు, త్రిపుటులకు, అన్నిటికీ అతీతము. కేవలం బ్రహ్మము కంటే వ్యక్తిగా భావించబడే నేను వేరుగా లేను. అనెడి అద్వైతానుభవమే సాధనకు పరాకాష్ట. కాబట్టి ఆత్మ కన్న వేరుగా నేను ఉన్నాను అనెడి భావనను విసర్జించాలి. విశ్వమంతా నాలోనే ఉన్నా నేను దేహానికే పరిమితం చేసుకోవడం వల్ల, ఆ విశ్వంలోనే ఒక రేణువు అయిపోతున్నాను. దేవుడు ఉన్నాడా? అనేది అసలు ప్రశ్నేకాదు. దేవుడికన్నా వేరుగా ఒకవ్యక్తిఅంటూ ఉన్నాడా? అన్నదే ప్రశ్న. నేను ఒక వ్యక్తినంటూ లేను, కేవలం ఉన్నదే పరమాత్మ అనే స్థాయికి ఎదగాలి, అదే నాలుగు యోగాల సారము. పరమాత్మ సర్వవ్యాప్తి కాబట్టి, అందరిలోనూ పరమాత్మను అట్లే పరమాత్మలో సకలమును దర్శించాలి.

# సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.

**- Mahabharatha**

## గమ్యం

ఎన్ని వేల కిలోమీటర్ల దూరప్రయాణమైనా మన ఇంటినుండి గమ్యంవైపు వేసే తొలి అడుగుతోనే ప్రయాణం ప్రారంభం అవుతుంది. అట్లే స్వస్వరూపానుభూతికి మూల తలంపును దాని మూలంలోకి ఉపసంహరించుట ద్వారా మన నిజమైన ఆధ్యాత్మిక ప్రయాణం మొదలవుతుంది. సకల సాధనల గమ్యం మనోనాశం కాబట్టి, నేను ఎవరు? అను విచారణ ద్వారా మనస్సును అంతర్ముఖం చేస్తే, మనస్సుకు చాపల్యం తగ్గి, దాని మూలంలో నిలబడే శక్తి అధికమవుతుంది. గాలిలేని చోట ప్రకాశించు నిశ్చలదీపంవలె, ఒకానొక రోజున మనస్సు దాని మూలంలో స్వస్థితిని పొందుతుంది. అప్పుడు దేహేంద్రియ మనోబుద్ధులకు అతీతమైన, స్వతంత్రమైన, అలౌకిక, అభౌతిక, ఆనందం స్వరూపంగా వ్యక్తమవుతుంది. అట్టి నేను ఎవరు? అను విచారణకు వివేక, వైరాగ్యములు ఆవశ్యకములు. నెమ్మదిగా, సహజముగా, విచారణ ద్వారా మనస్సు అంతర్ముఖమైతే చివరికి దాని మూలంలో అది నశిస్తుంది. మనస్సు దాని అలవాటు ప్రకారం భ్రాంతి విషయాల పట్ల ఆకర్షింపబడినప్పుడెల్లా, దానిని ఉపసంహరించి హృదయంలో నిలపాలి. మనస్సును దాని మూలమైన హృదయంలో స్వస్థితిని పొందేలా అభ్యాసం చెయ్యాలి. మనస్సుకు దాని మూలంలో ఉన్న స్వరూప శాంతి గురించి బోధించాలి. వ్యక్తికి ఆధారమైన అద్వయ చైతన్యమే సకల చరాచర సృష్టికి ఆధారంగా ఉన్నట్లు అనుభవపూర్వకంగా గ్రహించి, అనంతత్త్వంతో అభేదత్త్వాన్ని సాధించుటయే మన సకల సాధనల గమ్యం. సజీవ గురువు లభ్యమైనందుకు మనము ఎంతో అదృష్టవంతులము. అనేక జన్మల పుణ్య ఫలితంగానే సద్గురువు లభిస్తారు. స్వస్వరూపానుభూతికి సద్గురువు కృపయే అత్యంత కీలకం. సద్వస్తువు 'తాను'గా 'నేను'గా అనుభవంలోకి వచ్చేవరకు జనన మరణ ప్రవాహం ఆగదు.

**ఓంతత్‌సత్**

**- చావలి సూర్యనారాయణమూర్తి, అమలాపురం, సెల్ : 9963195064**

# పాప పరిహారానికి - పశ్చాత్తాపానికి మించిన మందు లేదు

భౌతిక సుఖ జీవనం వలన ఆధ్యాత్మిక సంతృప్తి కలగదు. సుఖజీవనం దొరికింది అని మురిసిపోకూడదు. తదుపరి జన్మలో తిప్పలు తప్పవు. నిజమైన ఆనందం, సుఖం ఆధ్యాత్మిక పరిణితి వల్లనే కలుగుతుంది. దైవభీతి గలవాడే దైవాన్ని ఆర్తితో ప్రేమించి మనస్సు బరువు దించుకొని తృప్తిపడతాడు. సత్యం అన్నిటికంటే గొప్పది. దానిలో సాధకుడు జీవనం చెయ్యాలి. అది ఎలా అంటే ఊరు తెలియనివాడికి, దారి తెలియనివాడికి ఊరు (స్వగృహం) చేరటం ఎట్లాగా! సాధన చేస్తున్నాము యుగాలు గడిచాయి, గమ్యం దగ్గరలోనే ఉంది. ప్రభువుతో (గురువుతో) పరిచయం లేదు నేను ఎలా చేరగలను అని నిజమైన తపన నాకు కలుగజేయి. నేను ఉపదేశం చెయ్యటంమాని ఆచరణలో మనస్సును నింపు దాహంగా ఉంది నీ ప్రేమామృతం త్రాగకపోతే దాహం ఎలా తీరుతుంది? కబీర్ "నవ్వుతూ నవ్వుతూ నాధుణ్ణి చేరలేరు. చేరినవారు అందరూ విలపించి ఏడ్చినవారే" అన్నారు. రామకృష్ణుడు అమ్మా నేను జన్మ అపరాదిని నఖశిఖపర్యంతం వికారాలతో నిండియున్నాను నీవు దుఃఖాలను తీసే దానివి నన్ను నాలో చేర్చుకో నా అవగుణాలు అన్నీ మన్నించు నేను నీ సంతానాన్ని అనటానికి సిగ్గుగా ఉంది అంతర్యామీ నీవు ఒక్కడివే నాకు ఆధారము నీవు చేయి విడిచినచో దుఃఖసాగరాన్ని ఎవరు దాటించగలరు" అన్నారు. ఈ ఆర్తి మన గురువరేణ్యులపై ఇలా ఉండాలి తండ్రి "లక్షమంది అడ్డు తగిలినా నన్ను మరువబోకు నావంటివారు నీకు అనేకులు ఉన్నారు. నీవంటివారు నాకు ఎవరు ఉన్నారు? అని నిర్వేదం పొందటం వల్ల విరక్తులమౌతాము ప్రకృతి విషయాలపై విరక్తి అయిన వానికి 'నేను' ముక్తుడనే జ్ఞానం కలుగుతుంది. అప్పుడు సాధకుని జన్మవాసనలు క్షీణించి పోతుంది దానికి ముందు నా పూర్వ జన్మ పాపపంకిలమైన కర్మలను మన్నించు అని అంగీకరిస్తున్నాను. దానికి పరిహారమొనర్చుకొంటాను అని వేడుకోవాలి ముందు మనకు తెలియని "శరీరం నేను" అనే దోషాలు వాటివల్ల వచ్చే తలంపులను అంగీకరించాలి కదా! సాధకుడు ఈ అతి ముఖ్య విషయాన్ని గ్రహిస్తే తేలికైన హృదయం ఉల్లాసంగా ఉంటుంది. అంతేకాని గుండు గొరిగించుకొని మొక్కు తీర్చుకొన్నామని మురిసిపో కూడదు. మనస్సులోని మలినాలను ముండనం చేసుకోవాలి. అరిషడ్వర్గాలనే కాటుకతో నిర్మించిన గదిలో నీవు నా హృదయంలో ఉన్నావు నీకు నలుపు అంటలేదు నా గదిలోంచి బయటకు తీసుకొనిరా తండ్రి అనాలి. గురువు నన్ను నడిపిస్తున్నాడు అన్న స్ఫూర్తి గురు మంత్రం కన్నా గొప్ప శక్తి. గురు ప్రార్థన మనకు గురువుకు వారధి నిర్మిస్తుంది. అదే ధ్యానం, అదే ధారణ, అదే తపస్సు. గురువు మాటకు ఎదురు తిరిగితే నష్టపోయేది, కష్టపడేది మనమే. ఎన్ని కష్టాలు వచ్చినా కంట తడిపెట్టకుండా ప్రార్థన చెయ్యాలి. మానవులందరినీ సమానంగా చూచేవాడే యోగి. చచ్చినవానిలా జీవించేవాడే అభయస్థితికి చేరిపోతాడు. గురు ప్రార్థనతో శంకలను తొలగించుకొన్నవాడే మనస్సును నిరోధించగలడు అప్పుడు మనపై అమృతజల్లులు కురుస్తాయి. అట్టివాడే తన్ను తాను తెలుసుకోగలడు.

**- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం, సెల్ : 9491968966**